క్లుప్తంగా

31న కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అన్ని శాఖల విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

– ఎమ్మెల్యే చినరాజప్ప



చదలాడలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశించారు. చదలాడలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వే, వైద్య శిబిరాల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలో జరిగిన మరణాలు పునరావృతం కాకుండా, ముందస్తుగానే ప్రతి కుంటుబంలో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం వైద్య సేవలను పరిశీలించారు.

అంబరాన్నంటిన పులిమేరు సంబరం



ముసలమ్మ తల్లి సంబరంలో ఆకట్టుకున్న కాళికాదేవి వేషాలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే గ్రామ దేవతగా పేరొందిన మండలంలోని పులిమేరు ముసలమ్మ తల్లి సంబరం బుధవారం అంబరాన్నంటింది. ఏటా నిర్వహించే అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా వేకువజాము నుంచి పూజలు నిర్వహించి, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరానికి పులిమేరు, గోరింట, గుడివాడ, దివిలి, చంద్రమాంపల్లి, చదలాడ, ఉలిమేశ్వరం తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమైన సంబర ఉత్సవంలో భాగంగా ఆయా దేవతామూర్తుల బళ్ల వేషాలు, గరగలాట, బ్యాండ్‌మేళం వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో సంబరాన్ని నడిపించారు.

భక్తిశ్రద్ధలతో నారాయణ స్వామి గ్రామోత్సవం



సామర్లకోటలో మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: గోదావరి తీరాన వేంచేసిన నున్న అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో సాగింది. కృష్ణాష్టమి వేడుకల ముగింపును పురస్కరించుకుని ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, శ్రీదేవి, భూమి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా మొదలైన గ్రామోత్సవం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గోలి వారి వీధి, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డ వారి వీధి, నీలమ్మ చెరువు, మఠంసెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా కొనసాగింది.

రాత్రి 10 వరకే భారీ వాహనాలకు అనుమతి

కాకినాడ క్రైం: నగరంలో ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకే భారీ వాహనాలకు అనుమతి ఉందని డీఎస్పీ రఘువీర్ అన్నారు. బుధవారం స్థానిక వార్ఫ్ రోడ్‌లో ఛాంబర్ ఆఫ్ కామర్స్, లారీ ఓనర్ల సంఘం, మినీ లారీ యూనియన్ ప్రతినిధులతో సమావేశం జరిగింది. డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ, భారీ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపరాదని సూచించారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలన్నారు. అందుకనుగుణంగా యూనియన్ సభ్యులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సహకరించాలన్నారు. వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు, ట్రాఫిక్ సీఐ ఎన్.రమేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ వీవీ.రాఘవులు, డైరెక్టర్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హైసెక్యూరిటీ ప్రాంతాలుగా ప్రకటించాలి

వైద్య విద్యార్థినిపై విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో అమానుషంగా అత్యాచారం చేసి హత్య చేయడం దుర్మార్గమైన చర్య. ఇటువంటి చర్యలకు దేశంలో మరెవ్వరు పాల్పటకుండా కటినమైన చర్యలు తీసుకోవాలి. శాశ్వతంగా హైసెక్యూరిటీ ప్రాంతాలుగా ఆస్పత్రులను ప్రకటించి వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి.

– సందీప్, వైద్యాధికారి, కొమరగిరి



చట్టాలున్నా ప్రయోజనం శూన్యం



మహిళల రక్షణ కోసం చట్టాలున్నా ప్రయోజనం శూన్యం. మహిళలను వేధింపులకు గురిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి. కోల్‌కతాలో మహిళా పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారం వైద్య సిబ్బందిని కదలించి వేసింది. నిందితులపై కేసులు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. వైద్య సిబ్బందికి రక్షణ లేకపోతే విధులు నిర్వహించడం కష్టంగా మారుతుంది.

– డాక్టర్ రాకేష్, సామాజిక ఆరోగ్య కేంద్రం, సామర్లకోట

ఆటలు.. ఉపాధికి బాటలు

- జిల్లాలో క్రీడలకు పెరిగిన ఆదరణ
- పలు విభాగాల్లో శిక్షణ పొందుతున్న ఆటగాళ్లు
- పిఠాపురంలో పెరుగుతున్న క్రీడాకారులు, శిక్షణ కార్యక్రమాలు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



విలువిద్యలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

పిఠాపురం: మనం నేర్చుకున్న ఆటలే మన ఉపాధికి బాటలుగా మారుతాయి. ప్రస్తుత కాలంలో ఉద్యోగావకాశాల్లో క్రీడాసక్తి కూడా చూస్తున్నారు. వివిధ రకాల క్రీడలకు కాకినాడ జిల్లాకు ఒక అవినాభావ సంబంధం ఉంది. పిఠాపురం మహారాజా విద్యకు ఇచ్చిన ప్రాధాన్యత ఇక్కడ క్రీడలను పెంచి పోషించింది. గత 50 ఏళ్లగా జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రస్థాయి వివిధ క్రీడా పోటీల్లో పిఠాపురానికి చెందిన క్రీడాకారులు ఎంతో మంది తమ ప్రతిభను చాటుకుంటున్నారు. జాతీయస్థాయి పతకాలను సాధించి దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. జిల్లాలో క్రీడలకు ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఇక్కడ ప్రాక్టీస్ చేసిన వారు జాతీయ స్థాయి పోటీల్లో విజేతలు గాను, పలు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. రగ్బీ, బాక్సింగ్, తైక్వాండో, బాస్కెట్‌బాల్‌తోపాటు ప్రాచీన విద్యలైన విలువిద్య, కర్రసాము క్రీడలలో మొదటి స్థానాలలో నిలిచారు. పిఠాపురం నియోజకవర్గంలో అన్ని క్రీడా విభాగాల్లో రాణిస్తున్న, శిక్షణ పొందుతున్న క్రీడాకారులు సుమారు 20 వేల మందికి పైగా ఉన్నారు. భారతా హాకీ క్రీడాకారుడైన ధ్యాన్ చంద్ గౌరవ సూచకంగా ఆయన పుట్టిన రోజు అయిన ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకొంటారు.

పిఠాపురం పట్టణానికి చెందిన కాకాడ హరిణి గత మే నెలలో కాకినాడలో రగ్బీ జిల్లా స్థాయిలో స్వర్ణ పతకం, మే 29, 30, జూన్ ఒకటో తేదీన విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో విజయం సాధించింది. జులై 19, 20, 21 తేదీలలో పూణేలో జాతీయస్థాయిలో రగ్బీ ఆడింది.

పి.నాని పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించాడు పార్వతిపురం, జయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో పాల్గొన్నారు. బోను జయదీప్ పిఠాపురం, కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలలో రజత, కాంస్య పతకాలు సాధించాడు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నాడు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి ఓపెన్ ఆర్చరీ ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యాడు.

చీపురుపల్లి లోహిత్ రామచంద్రపురం, కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో రెండు స్వర్ణ పతకాలు సాధించాడు.

జాతీయస్థాయి పతకాల సాధనే ధ్యేయం



నాకు చిన్నప్పటి బాణాలు వేయడం అంటే చాలా ఇష్టం. అది చూసి మా అమ్మనాన్న విలు విద్య నేర్పించారు. కష్టపడి మంచి శిక్షణ పొంది జాతీయ స్థాయిలో పతకాలు సాధించాను. జాతీయ స్థాయి క్రీడాకారుడిగా పిఠాపురానికి గుర్తింపు తేవడమే నాధ్యేయంగా పెట్టుకున్నా. పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించాను. మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తా.

– పి.నాని విలు విద్య క్రీడాకారుడు, పిఠాపురం

దేశానికి గుర్తింపు తేవాలన్నదే తపన



రగ్బీ ఆటలో రాణించాలంటే చాలా కష్ట పడాలి. అయినప్పటికీ పట్టుదలతో ఆట నేర్చుకున్నాను. జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొన్నా. ఒక మహిళగా క్రీడల్లో రాణించాలంటే అందరి సహకారం అవసరం. నాకు అన్ని విధాలా అందరూ సహకరిస్తున్నారు. మరింత కృషి చేసి జాతీయ స్థాయిలో రాణించాలన్న సంకల్పంతో శిక్షణ పొందుతున్నాను. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి పేరు తేవాలన్నదే నా తపన.

–కాకాడ హరిణి, రగ్బీ క్రీడాకారిణి, పిఠాపురం

ఉపాధి అవకాశం ఉన్న క్రీడలనే ఎంచుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్సు కోటాలో ఉద్యోగం పొందాలంటే 29 క్రీడలకు మాత్రమే గుర్తింపు ఉంది. వాటిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, సైక్లింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్ జిమ్నస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కోకో, రోలర్ స్కేటింగ్, రోవింగ్, సైలింగ్, షూటింగ్, షటిల్ బ్యాట్మింటన్, సాఫ్ట్‌బాల్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలలో రాణించిన వారికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలలో స్థానం లభిస్తోంది. మిగిలిన ఏ క్రీడలు ఆడినా వీటికి వర్తించదు. కేంద్ర ప్రభుత్వం 65 రకాల క్రీడలలో రాణించిన క్రీడాకారులకు మాత్రమే స్పోర్ట్సు కోటాలో ప్రాధాన్యత కల్పిస్తుంది. అన్ని విషయాలను తెలుసుకుని ప్రతి క్రీడాకారుడు ముందడుగు వేయాలి. క్రీడలను ఎంపిక చేసుకోవాలి.

– పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్, పిఠాపురం

కమిషనర్‌కు అవుట్ సోర్సింగ్ సిబ్బంది అభినందనలు



కమిషనర్‌ను కలిసిన ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది

సామర్లకోట: నూతన మున్సిపల్ కమషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ శ్రీవిద్యను మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా భీమవరంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేసిన ఎ.శ్రీవిద్యను సామర్లకోటకు బదిలీ చేయగా, ఆమె ఇటీవల సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన జాస్తి రామారావును గతంలో పని చేసిన గుంటూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు సిబ్బంది తమను తాము పరిచయం చేసుకున్నారు.

పాత లబ్ధిదారులకు సొమ్ము తిరిగివ్వండి

సామర్లకోట: టిడ్కో ఇళ్లు రద్దు చేసుకున్న వారికి, వారు కట్టిన రూ.లక్ష వెనక్కు ఇవ్వాలని బీజేపీ మాజీ అధ్యక్షుడు సుంకవిల్లి బాపిరాజు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యను కోరారు. టిడ్కో ఇళ్లపై సమాచార హక్కు చట్టం ప్రకారం వివరణ కోరితే, సమావేశానికి హాజరు కావాలని చెప్పడం వింతగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన కమిషనర్‌తో మాట్లాడుతూ, సుమారు ఏడేళ్ల క్రితం రూ.లక్ష చెల్లించగా, అనేక మందికి చెందిన టిడ్కో గృహాలను రద్దు చేశారని ఆరోపించారు. రద్దు చేసిన ఇళ్లను మరొకరికి కేటాయించిన నేపథ్యంలో కట్టిన సొమ్మును పాత లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. టిడ్కో డైరెక్టర్ నుంచి అనుమతి వచ్చిన తరువాత మాత్రమే సొమ్ము చెల్లిస్తామని కమిషనర్ సమాధానమిచ్చారు. ఏడేళ్లకు వడ్డీతో కలిపి పాత లబ్ధిదారులకు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి



పాదగయ క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్

పిఠాపురం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్సీ హరిప్రసాద్ అన్నారు. పిఠాపురం మండలం ఎస్‌కే పాలెం గ్రామంలో బుధవారం సాలిడ్ రిసోర్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి రోజు మనం ఇంట్లో వాడే వ్యర్థాలను రోజువారీ వచ్చే స్వచ్ఛంద కార్పొరేషన్ సిబ్బందికి అందజేయాలన్నారు. వారు సేకరించిన వ్యర్థాలు తడి పొడి వేరు చేసి వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువులు, కాగితాలు ప్లాస్టిక్ ఇతర వస్తువుల ద్వారా పవర్ జనరేషన్ జరుగుతుందని ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా కృష్ణా జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామంలో ప్రారంభించామన్నారు. ఈపద్ధతిని నియోజవర్గం అంతా అమలు చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టం కేంద్రాన్ని పరిశీలించిన ఆయన చెత్త సేకరణ వాహనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పిఠాపురం నియోజవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ముమ్మిడి మహాలక్ష్మి, జనసేన పార్టీ నాయకులు పిల్ల శ్రీధర్, శివశంకర్, జవ్వాది జోగేశ్వరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతాల నిర్వహణ ఏర్పాట్ల పరిశీలన

పిఠాపురం పాదగయ క్షేత్రంలో 10వ శక్తి పీఠం పురూహూతికా అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్సీ జి.హరిప్రసాద్ పరిశీలించారు. వ్రతాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గా భవాని, సీఐ శ్రీనివాస్ తదితరులకు సూచించారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

- సీపీఎం నాయకుల డిమాండ్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: విద్యుత్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటంలో పోలీసు తూటాలకు బలైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలకు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె.చిన్నా, కె.రాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలలో భాగంగా స్మార్ట్ మీటర్లను బిగుంపు వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యమం ఫలితంగా 15 ఏళ్ల పాటు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విద్యుత్ ధరలు పెంచేందుకు సాహసించలేదని తెలిపారు. ఈ విద్యుత్ పోరాటం సందర్భంగా అప్పటి టీడీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు జరిపిన కాల్పులలో ముగ్గురు కార్యకర్తలు అమరులయ్యారని గుర్తుచేశారు. గతంలో విద్యుత్ ధరల పెరుగుదలను వ్యతిరేకించిన టీడీపీ నాయకులు నేడు అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడవకముందే యూటర్న్ తీసుకుని ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. అదాని కంపెనీ నుంచి స్మార్ట్ మీటర్లు రాష్ట్రానికి చేరుకున్నాయని, ప్రయోగాత్మకంగా వేరే రాష్ట్రంలో బిగించిన స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేయడాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. వీటివల్ల విద్యుత్ ధరలు పెరగడమే కాకుండా, రైతుల 9 గంటల ఉచిత విద్యుత్‌కి మంగళం పాడబోతున్నారని వారు విమర్శించారు. వేల మంది మీటర్ రీడర్ల ఉపాధి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.విశ్వనాథం, నాగేశ్వరరావు, రాజేష్, అప్పన్న, సూర్యనారాయణ, రమణ, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంటలో చీడ పురుగులను గుర్తించండి

- డీఆర్‌సీ డీడీఏ హరి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ హరి

పెద్దాపురం: ప్రస్తుత వ్యవసాయంలో చీడ పురుగుల బెడద ఎక్కువగా ఉందని, వాటిని గుర్తించి రైతులకు మెరుగైన సూచనలు ఇవ్వాలని పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం డీడీఏ బీవీఎస్‌సీ హరి అన్నారు. మండలంలోని కట్టమూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఏడీఏ ఎస్ దైవకుమార్ అధ్యక్షతన పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో క్రాప్ లైవ్ సిస్టమ్ వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఏ హరి మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఉండే చీడ పురుగులు, తెగుళ్లను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఏ గ్రామంలో అయితే నీటి నిల్వలు ఎక్కువగా ఉన్నాయో అక్కడకు నేరుగా శాస్త్రవేత్తలు తమ సూచనలు అందిస్తారన్నారు. రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ భ్రమరాంబ, పెద్దాపురం, కిర్లంపూడి ఏఓలు సంజయ్‌కుమార్, అమృత, ఏఈఓ ప్రసాద్, ఆయా గ్రామాల వీపీఓలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

తెలుగు భాషకు వన్నె తెచ్చిన రామ్మూర్తి



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న విజయ్‌ప్రకాష్

పెద్దాపురం: ప్రపంచంలో తెలుగు భాషకు వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులని ఉభయ రాష్ట్రాల గురు సహస్ర అవధాని కడిమళ్ల వరప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో బుధవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని, ప్రాచీనం నుంచి ఆధునిక కాలం కవులు రచనలను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంట్లో తెలుగు భాషను నేర్పించాలని విజయ్‌ప్రకాష్ అన్నారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి నివాళుర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఎస్.ప్రశాంతి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ



ఎరువుల దుకాణంలో స్టాక్ పరిశీలిస్తున్న గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ

పిఠాపురం: ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టులో గొల్లప్రోలు మండలానికి 385 మెట్రిక్ టన్నులు యూరియా కావాల్సి ఉందన్నారు. గొల్లప్రోలు మండలంలో వివిధ గ్రామాలలో రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ పరపతి సంఘాలు, ప్రైవేట్ వ్యాపారస్తు ద్వారా 622 మెట్రిక్ టన్నులు స్టాక్ వచ్చినట్టు ఆయన తెలిపారు. దీనిలో రైతు సేవ కేంద్రాల నుంచి 123, పీఏసీఎస్‌ల నుంచి 86, దుకాణాల నుంచి 413 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఇంకా 162 టన్నులు రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ పరపతి సంఘాలు, దుకాణాలలో కలిపి నిల్వ ఉన్నట్టు ఆయన తెలిపారు. గొల్లప్రోలు మండలానికి అధికంగా యూరియా వాడకం జరగడానికి కారణం అధిక వర్షాల వలన పంట ముంపునకు గురైన పాడైపోవడంతో మళ్లీ పొలాల్లో చల్లుతున్నారన్నారు. ముంపునకు గురైన పంటలకు బుస్టర్ డోస్‌గా 20 కేజీలు యూరియా, 20 కేజీల పొటాషియం వేసి తదుపరి వారం రోజులు లోపల మిగిలిన యూరియా వేస్తే తగ్గించవచ్చన్నారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గొల్లప్రోలు మండలంలో ఎటువంటి ఎరువుల కొరత లేదని రైతులు దుకాణం నుంచి కొనుగోలు చేసి నిల్వచేసుకోవద్దని సూచించారు.

భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

కాకినాడ రూరల్: తెలిసి తెలియకో చేసే తప్పిదాల వల్ల విద్యార్థులు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని జిల్లా లా అండ్ ఆర్డర్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రఘువీర్ విష్ణు అన్నారు. యాంటీ ర్యాగింగ్, డ్రగ్ అబ్యూస్, ఆల్కహాలిజం -2024-25 అనే అంశంపై బుధవారం కాకినాడ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఉన్నత విలువలు, లక్ష్యాలు గల విద్యార్థి భవిష్యత్తును తునాతునకలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎలక్యూషన్, డిబేట్, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, మాణిక్యరెడ్డి హెల్త్ సర్వీసెస్ సమర్పించిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతిశ్రీ, సీనియర్ అడ్వకేట్ జనాబ్ సయ్యద్ సలార్ పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ



పథకాల ప్రజెంటేషన్ ఇస్తున్న అధికారులు

సామర్లకోట: ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న పథకాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ)లో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకున్న 11 జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం శిక్షణ ప్రారంభించారు. ఇందులో భాగంగా రెండో రోజు ఆయా శాఖల్లోని ప్రభుత్వ పథకాలు, వాటిని అందుకోవడానికి అర్హతలను ఆయా శాఖల అధికారులు వివరించారు. స్వయం సమృద్ధితో మౌలిక వదుపాయాల గ్రామం అనే అంశంపై ఈటీసీలో శిక్షణ ఇస్తున్నారు.

దివ్యాంగుల డిజిటల్ విద్యపై శిక్షణ

కాకినాడ సిటీ: దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి, వారిలో అభ్యసన నైపుణ్యాలను పెంపొందించే అంశంపై సహిత విద్య రిసోర్స్‌పర్సన్లకు బుధవారం కలెక్టరేట్‌లోని విధాన గౌతమి కాన్ఫరెన్స్ హాలు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్యాబ్‌ల వినియోగంపై ఐఈఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.రమేష్, రాష్ట్ర సమగ్రశిక్షా ఐఈ కన్సల్టెంట్ పరిశీలకుడు వై.నరసింహం, రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎస్ అమ్మినాయుడు మాట్లాడారు. డిజిటల్ విద్యను అందించడంలో, దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని చెప్పారు. దివ్యాంగుల్లో అభ్యాసన ఫలితాలు రాబట్టేందుకు దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిందన్నారు. ఇందులో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పాటు, 33 రకాల యాప్‌లను ఉంచడం వల్ల దివ్యాంగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు పర్యవేక్షించారు. డిజిటల్ విద్యపై రాష్ట్ర కీరిసోర్స్ పర్సన్లుగా బి.మహాలక్ష్మీ నాయుడు, పి.సునీల్‌కుమార్ వ్యవహరించారు.

గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- గణేష్ ఉత్సవ సమితి కాకినాడ జిల్లా కన్వీనర్ మాలకొండయ్య



ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న మాలకొండయ్య

పిఠాపురం: గణేష్ ఉత్సవాలు అన్ని ప్రాంతాల్లోను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి కాకినాడ జిల్లా కన్వీనర్ మాలకొండయ్య కోరారు. ఆయన బుధవారం గొల్లప్రోలు నగర పంచాయతీలో నగర గణేష్ ఉత్సవ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు దువ్వూరి సుబ్రహ్మణ్యంతో కలిసి పర్యటించారు. పర్యటనలో భాగంగా మాట్లాడుతూ గొల్లప్రోలులో నగర గణేష్ ఉత్సవ సమితి కమిటీ ప్రారంభం కావడం సంతోషదాయకమన్నారు. 9 రోజులు గణేష్ ఉత్సవాలు ఘనంగా జరగాలని, ప్రభుత్వ అధికారులు అండగా ఉండేలా అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ పరిశుభ్రత ఉండేలా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. అన్ని మండపాలు, ఒకే ప్రాంతంలో నిమజ్జనం జరిపేలా అధికారులతో చర్చించాలన్నారు. ఉత్సవాలు జరిపి హిందువుల ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, మలిరెడి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, పడాల శ్రీను, మండల అధ్యక్షుడు పోసిన సత్యనారాయణ, మేడసాని కామరాజు, బోడకుర్తి పెద్దిరాజు, వియ్యపు రాములు, చీపూరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.